వే ట్టు వదలని విక్రమార్కుడు ఎప్పటిలాగే చెట్టుపై నుండి శవాన్ని దించి భుజాన వేసుకొని నడవ సాగేడు. అప్పుడు శవంలోని బేతాళుడు పకాలున నవ్వాడు.

విక్రమార్కుడు ఆశ్చర్యంగా బేతాళుణ్ని

# కాకీ-కక్ష

డా॥ బి.ఎస్.ఎన్.మూర్తి



అడిగాడు, "ఎందుకు నవ్వుతున్నావు?" అని.

బేతాళుడు జవా బిచ్చాడు - "నువ్వీ చీకట్లో, ఈ అరణ్యంలో, ఈ గుడ్లగూబల అరుపుల మధ్య, విష సర్పాల బుసల మధ్య ఎందుకు అవస్థ పడుతున్నావో అర్థం కాదు. చరిత్రలో పట్టుదల అంటే నీ పేరే ముందు చెప్పుకుంటా రని గర్వ పడుతున్నావా? నీకు గవర్రాజు, పోతరాజుల కథ తెలీదు. వారి చరిత్ర వింటే వారి పట్టుదల ముందు నీ పట్టుదల ఏ పాటిదో అర్థ మవుతుంది. నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకు వా రిద్దరి కథ చెబుతాను, విను" అంటూ ప్రారంభించాడు.

☆ ☆ ☆

అనగా అనగా ఒక పల్లెటూరు. ఆ ఊళ్లో గవర్రాజు ఉన్నాడు. ఒక రోజు ఉదయాన్నే నిద్ర లేచాడు. నిద్ర లేచే సరికి తను చాలా కోపంగా ఉన్నాడు. 'ఏమిటీ ఈ రోజు నిద్ర లేవగానే ఇంత కోపం వచ్చేసింది. ఇంత కోపం ఎవరి మీదబ్బా?' అని ఆశ్చర్య పోయాడు. అంతలో ఒక కాకి అతని

ఇంటి పెరటి గోడ మీద వాలింది. కాకిని చూడగానే అతనికి పోతరాజు గుర్తొచ్చాడు. ఆ కాకి 'కావు కావు' మంటూ అరవ సాగింది. కాకి చేత తనను అడ్డమైన తిట్లూ ఆ పోతరాజు తిట్టిస్తున్నాడని గవ్రాజు అనుకున్నాడు. తన కోపం ఎవరి మీదో తెలిసింది. "వా డింటి మీద కాకిని ఈ పోతరాజు మా ఇంటి మీదికి పంపించి, పైగా కాకి గోల చేయిస్తాడా? వాడి సంగతి చూస్తాను" అన్నాడు.

దారినే పోతున్న పోతరాజుకు ఆ మాటలు వినిపించాయి. "కాకి అరవడం మాత్రమే చేసింది. కాకి గోల చేసింది నువ్వు. ఆ మాట కొస్తే మొన్న మీ వీధిలో కుక్క మా వీధిలోకి వచ్చా మొరగ లేదేమిటి? అదేమిటి మొరిగిందో నాకు పూర్తిగా అర్థ మయిందిలే" అన్నాడు.

గవ్రాజుకు ఇంకా కోప మొచ్చింది. "అదేమిటి మొరిగిందో నాకు తెలుసులే. రోజ్‌గార్ కంట్రాక్టుల్లో సొమ్ము తినేసి పనై పోయిందని చూపించావు. ఆ విషయమే మొరిగి ఉంటుంది" అన్నాడు.

పోతురాజుకూ ఇంకా కోప మొచ్చింది. "ఆ కాకి ఏమిటి గోల పెట్టి ఉంటుందో నాకూ తెలుసులే. అసలు కాంట్రాక్టులన్నీ బినామీ పేర్లతో నువ్వే ఉంచుకొని చాలా సొమ్ము తినేశావు. అదే గోల పెట్టి ఉంటుంది" అన్నాడు.

గవ్రాజుకు కోపం తీవ్ర స్థాయిలో వచ్చింది. "నువ్వే ఆ కాకివి!" అన్నాడు.

పోతరాజుకూ కోపం తీవ్ర స్థాయిలో వచ్చింది. "నువ్వే ఆ కుక్కవు!" అన్నాడు.

గవ్రాజు మళ్లీ అన్నాడు - "నువ్వే కాకివి!"

పోతరాజు మళ్లీ అన్నాడు - "నువ్వే కుక్కవి!'

"కాకీ!"

"కుక్కా!"

పోతరాజు మాట పూర్తి కాకుండానే గవ్రాజు అతన్ని కొట్టడానికి లేచాడు. పోతరాజు కూడా వీరావేశంతో ముందుకు వచ్చాడు. కాని ఇంతలో అతని కాలు జారి కిందికి తూలి పోయాడు. అతని తల రాతికి కొట్టుకోడంవల్ల తల మీద పెద్ద దెబ్బ తగిలింది. రక్తం కార సాగింది.

ఆ సమయానికి ఊళ్లో జనం చాలా మంది అక్కడికి చేరారు. తలకు తగిలిన గాయం మీద తుండు గుడ్డ కట్టారు. తర్వాత హడావుడిగా అతన్ని పట్నంలోని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు.

గవ్రాజు విసుక్కొన్నాడు. "ఛీ! నేను దెబ్బ కొట్టకుండానే వాడు ముందే పడి పోయాడు. వాడిని కొట్టే ఛాన్సు పోయింది."

సరిగ్గా అదే సమయానికి గవర్నమెంటు బస్సొకటి ఊళ్లోకి వచ్చింది. జనం పోతరాజును ఆ బస్సు మీద పట్నానికి తరలిద్దామనే ఆలోచనలో పడ్డారు. కాని పోతరాజు వారించాడు. అది అపోజిషను పార్టీ వాళ్ల ప్రయత్నించి ఊళ్లోకి వేయించుకొన్న బస్సు. "అందులో నేను కూర్చోను" అన్నాడు.

చేసేది లేక అతన్ని ఒక ఎద్దుల బండి మీద పట్నానికి తరలించారు.

పట్నంలో హాస్పిటల్లో వైద్యుడు అతన్ని పరీక్ష చేశాడు. వెంట వచ్చిన వారితో అన్నాడు -"దెబ్బ తగిలి చాలా సేపయింది. చాలా రక్తం పోయింది. అర్జెంటుగా రక్తం ఎక్కిస్తే గాని ఇతడు బ్రతకడు. మీలో ఎవరైనా రక్తం ఇవ్వాలి."

అతనికి రక్త దానం చేయడానికి చాలా మంది సిద్ధ పడ్డారు.కాని ఎవరి బ్లడ్ గ్రూపూ సరి పోలేదు. సమయం గడిచిన కొద్దీ అతని పిరిస్థితి ఆందోళనకరంగా మారింది.

ఎంత శత్రు వయినా తన ఊరి మనిషే కాబట్టి, క్షణ క్షణానికీ పరిస్థితి విషమిస్తున్న దని కబురు అందడంతో గవ్రాజు అతన్ని చూడ్డా నికి నలుగురితో పట్నానికి బయలుదేరాడు. ఆసుపత్రికి వచ్చాడు.

వైద్యుడు గవ్రాజు రక్తమూ పరీక్ష చేశాడు. ఆశ్చర్యం! అతని గ్రూపు పోతరాజు రక్తం గ్రూపుతో సరి పోయింది.

"ఇతని ప్రాణాలు మీ చేతుల్లోనే ఉన్నాయి. బ్రతికించడం మీ వల్లనే సాధ్య మవుతుంది" అన్నాడు వైద్యుడు.

గవ్రాజు ఒక్క క్షణం ఆలోచించి చెప్పాడు - "నేను రక్త దానం చేస్తాను. నా రక్తంతో అతన్ని బ్రతికించండి. కాని ఒక్క షరతు. నేను రక్త దానం చేసినట్టు ఎవరికీ తెలియ కూడదు."

వైద్యుడు ఆ షరతుకు అంగీకరించాడు.

గవ్రాజు ఇచ్చిన రక్తంతో పోతరాజు గండం నుంచి బయట పడ్డాడు. పూర్తిగా కోలుకొన్నాక ఇంటికి తిరిగి వచ్చాడు.

కొన్నాళ్లకు ఊళ్లో మామూలు పరిస్థితి నెలకొంది. అంటే ఎప్పటిలాగే గవ్రాజు, పోతరాజు లిద్దరూ ఒకరినొకరు కాకీ, కుక్కా అంటూ తిట్టుకో సాగేరు.

☆ ☆ ☆

విక్రమార్కుడు బేతాళుణ్ని మరో భుజం మీదికి మార్చుకొంటూ ఉండగా బేతాళుడు అన్నాడు - "రాజా! నా దో సందేహం. బద్ధ శత్రువుకు మహోన్నతమైన రక్త దానం చేసి, ఆ కీర్తిప్రతిష్ఠలు అన్నీ వదులుకుంటూ, తన రక్త దానం విషయం రహస్యంగా ఉంచమని గవ్రాజు వైద్యుణ్ని ఎందుకు కోరాడు? దీనికి తెలిసీ సమాధానం చెప్ప లేక పోయావో నీ తల వెయ్యి చెక్క లవుతుంది!"

విక్రమార్కుడు సమాధానం చెప్పాడు. "గవ్రాజు కుకావలసింది పోతరాజు బ్రతికి ఉండటం. అంతేకాక అతడు అపోజిషను పార్టీలో ఉండడం. పోతరాజు అపోజిషను పార్టీలో ఉన్నంత కాలమూ. తన ఊరికి తనే పెద్ద నాయకుడు. పోతరాజుకు తన రక్త దానం తెలిసి పోతే, మనిషి మారి పోయి కృతజ్ఞతగా తన పార్టీలోనే చేరి పోవచ్చు. అలా చేరిన వాడు అంచెలంచెలుగా పైకెదిగి రేపు తన నాయ కత్వానికే ఎసరు పెట్టగలడు!'

బేతాళుడు మళ్లీ అడిగాడు - "పోతరా జంటే అంత భయపడే గవ్రాజు అసలు రక్త దానం చెయ్యడం మానేసి ఈ లోకం నుండి అతన్ని శాశ్వతంగా తొలగించుకో వచ్చుగా?"

"పోతురాజు కాక పోతే మరో వ్యక్తి అపోజిషను ఎలానూ తప్పదు. కాని అతనికి పోతరాజుతో తీరకుండా ఉండి పోయిన పాత పగలు చాలా ఉన్నాయి. ఆ పగలు తీర్చు కొంటూ, ఆ కోపాన్ని వ్యక్తం చేసుకొంటూ కాలం గడపటం అతనికి అలవాటై పోయింది. ఇంకోలా బ్రతకడానికి అతనికి మన సొప్పదు. అందుకే అతనికి తను రక్త దానం చేసి బ్రతికించిన సంగతి రహస్యంగా ఉంచాడు" విక్రమార్కుడు సమాధానం చెప్పాడు.

రాజు కీ విధంగా మౌన భంగం కలగగానే బేతుళుడు శవంగా మారి మళ్లీ చెట్టెక్కాడు.

## జోక్

పొరుగింటాయన: ఆవును కొనుక్కోవడంవల్ల మీ కేమైనా లాభం ఉందా?

ఇరుగింటాయన: ఓ...మా ఆవు రోజుకు నాలుగు శేర్లు పాలిస్తోంది.

పొ: అయితే మీ వాడకం పోను మిగులుతున్న దన్నమాట. ఎన్ని శేర్లు అమ్ముతున్నా వేమిటి?

ఇ: ఎనిమిది శేర్లు!